క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రాల్లో 63 పరీక్షలూ చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన 63 టెస్టులు జరగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో మలేరియా అధికారులు, అసిస్టెంట్ మలేరియా అధికారులు, సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశమై పలు అంశాలు చర్చించారు. ఐవీఆర్ఎస్ ప్రకారం మన జిల్లా టెస్టుల్లో వెనుకబడి ఉందన్నారు. అన్ని టెస్టులకు అవసరమైన కెమికల్స్ సరఫరా చేయాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ సీహెచ్ సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం కంటే గొప్ప సేవ మరొకటి లేదు



వెలంపేటలో అన్నప్రసాదం వడ్డిస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

జగదాంబ: అన్నదానం చేసి పలువురి కడుపు నింపడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అన్నారు. వెలంపేట, సీహార్స్ జంక్షన్, ఆయిల్‌మిల్లు సందులో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. యువత మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నిరాహకులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ఓనం వేడుకలు



ఓనం వేడుకల్లో కళాశాల అధ్యాపకులు తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిథమ్ క్లబ్ విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. విద్యార్థులకు నిర్వహించిన ఓనం రంగవల్లికల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలకు సిస్టర్ మార్గరిత్, సిస్టర్ అనసీ, డాక్టర్ నళినీదత్త న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరుడిగా దుర్గాగణపతి



అర్ధనారీశ్వర అలంకరణలో దుర్గాగణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆఖరి రోజు గురువారం అర్ధనారీశ్వర గణపతి అలంకరణలో దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఉదయం ఆలయంలో మహా గణపతి హోమం, మహా అభిషేకం, సహస్ర నామార్చన, అలంకరణ జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. ఆలయ ఈవో జి.వి.రమాబాయి, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు పల్లకీ ఊరేగింపు..

నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గాగణపతి ఉత్సవ మూర్తుల ఊరేగింపు మహోత్సవం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఈవో రమాబాయి తెలిపారు. మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవ మూర్తుల ఊరేగింపులో భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

ఇళ్లలోకే మురుగు ప్రవాహం

- వర్షం వస్తే అంతా చిత్తడే
- ఇబ్బందుల్లో కల్లుపాకలు, గాజులవీధి, ప్రసాద్‌గార్డెన్స్, దుర్గమాంబ సమాజం తదితర ప్రాంతాల ప్రజలు
- సమస్య పరిష్కరించాలని వినతి



తరచూ ముంపునకు గురయ్యే లక్ష్మీనగర్



ప్రసాద్‌గార్డెన్స్‌లోని ఓ వీధిలో ఇంటి ముందు సీసీ రోడ్డు, కాలువ నిర్మించుకుంటున్న స్థానికులు

జగదాంబ: వర్షం వస్తే చాలు పాతనగరంలోని పలు వీధులు చిత్తడిగా మారిపోతాయి. ప్రధాన రహదారుల మాటెలా ఉన్నా వీధుల్లో సీసీ రోడ్లు, కల్వర్టులు దుర్భరంగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. వందేళ్ల చరిత్ర గల పాతనగరంలో ఎప్పుడో నిర్మించిన కాలువలు, సీసీ రోడ్లు శిథిలమై వర్షం నీరు ఇళ్లలోకే వచ్చేస్తుండడంతో స్థానికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముక్కుపిండి ట్యాక్స్‌లు వసూలు చేసే జీవీఎంసీ సమస్యల పరిష్కారంలో ఎలాంటి చొరవ చూపడం లేదని పాతనగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల ముందే నిలిచిపోతున్న మురుగు నీరు..

జీవీఎంసీ 35వ వార్డులోని కల్లుపాకలు, గాజులవీధి, ప్రసాద్‌గార్డెన్స్, దుర్గమాంబ సమాజం, పండావీధి, మంచాల వీధి, పువ్వుల సందు, పిక్కిరిపేట, లక్ష్మీనగర్, అరటిపండ్ల సందు, వెలంపేట, ఆర్ఆర్ఎం రోడ్డు, జీఎస్ఎన్ శాస్త్రి రోడ్డు, రామకృష్ణానగర్ వంటి ప్రాంతాల్లోని వీధులన్నింటినీ ఇదే సమస్య పీడిస్తోంది. ఇక్కడ చిన్నచిన్న సందులు అనేకం ఉన్నాయి. వీటిలో పూర్వం నిర్మించిన రోడ్లు, కల్వర్టులు కాలక్రమేణా పూర్తిగా శిథిలమై మురుగు నీరు, వర్షం నీరు ఇళ్లల్లోకి ప్రవేశించి నిద్ర లేమి రాత్రులకు గురిచేస్తుందని స్థానికులు వాపోతున్నారు.

మురుగు.. దుర్వాసన..

వర్షం లేనప్పుడు దుర్వాసనతో సతమతమవుతున్నామని 35వ వార్డు ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల ముందు శిథిలమైన కాలువలు, రోడ్ల వల్ల ఎక్కడికక్కడ మురుగు ప్రవహించకుండా ఉండిపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిలిచిపోయి దుర్వాసన వ్యాపిస్తోందంటున్నారు. ఆపై దోమలు ప్రబలి వ్యాధులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు వార్డు పర్యటన సమయంలో రోడ్డు మీద నుంచే వెనుదిరిగి వెళ్లిపోతున్నారు కానీ వీధుల్లోకి రాకపోవడం వల్ల తమ బాధలు తెలియడం లేదంటున్నారు. లక్ష్మీనగర్, ప్రసాద్‌గార్డెన్స్, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో ఈ దుస్థితి మరింత తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు జరిగి, ముంపునకు గురైతేనే అధికార యంత్రాంగం స్పందిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

ప్రజలే మరమ్మతులు చేసుకుంటూ..

వీధుల్లో శిథిలమైన కాలువలు, రోడ్లను స్థానికులే తలా ఇంతని డబ్బులు వేసుకుని మరమ్మతు చేయించుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రసాద్‌గార్డెన్స్‌లోని గణేశ్వర పాఠశాల ఎదురుగా ఉన్న వీధుల్లో ఇళ్లలోకి నీళ్లు రావడంతో స్థానికులు సొంతంగా సీసీ రోడ్డు, కాలువల మరమ్మతులు చేయించుకున్నారు. అయితే ఇది తాత్కాలికమేనని అధికారులు పూర్తిస్థాయిలో రోడ్లు, కాలువలు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సొంతంగా నిర్మించుకున్నాం..



మా వీధిలో కాలువలు నిర్మించి ఎన్నో ఏళ్లయింది. మళ్లీ ఇంత వరకు ఎలాంటి మరమ్మతులు చేయకపోవడం వల్ల వర్షం, మురుగు నీరు ఇళ్లలోకి వచ్చేస్తోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల ఉన్నవారం అంతా డబ్బులు వేసుకుని కాలువ, రోడ్డు నిర్మించుకున్నాం.

– గెడ్డం లక్ష్మి, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35 వార్డు

అధికారులు వీధుల్లో పర్యటించాలి..



వీధుల్లో శిథిలావస్థలో ఉన్న కాలువలు బాగు చేయాలి. మురుగు, దుర్వాసన నుంచి ప్రజలను కాపాడాలి. అధికారులు ప్రధాన రోడ్ల పైనే కాకుండా వీధుల్లోనూ పర్యటించి సమస్యల గురించి తెలుసుకోవాలి. అప్పుడే మురికివాడల్లోని సమస్యలు పరిష్కారం అవుతాయి.

–లక్ష్మి, దుర్గమాంబ సమాజం, జీవీఎంసీ 35వ వార్డు

పవిత్రోత్సవాల్లో విశేష పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి



పవిత్రోత్సవాల్లో సిరులతల్లి

డాబాగార్డెన్స్: పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, సప్తకలశ ఆరాధన, అభిషేకం, పవిత్ర ఆరోపణం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. సాయంత్రం 6.30 నుంచి మహాశాంతి హోమం, నిరాజన మంత్ర పుష్పం జరిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి విశేష పూజలు, వేద ఆశీర్వచన చేయనున్నారు. మధ్యాహ్నం పంచామృతాభిషేకం అనంతరం 12.30 గంటల వరకు గర్భాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు, శాశ్వత సేవలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు నిర్వహించే పంచామృతాభిషేకం, దర్శనాలు నిలిపివేయనున్నట్టు చెప్పారు.

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయం మూసివేత..

ఈ నెల 7న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 1 నుంచి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్టు చెప్పారు. గ్రహణానంతరం సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ నిర్వహించి, అమ్మవారికి 5 గంటల ప్రాత: కాల పంచామృతాభిషేకం అనంతరం ఉదయం 7 గంటల నుంచి దర్శనాలకు అనుమతించనున్నట్టు చెప్పారు. భక్తులు గమనించాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి వినతి



సహాయ మేనేజర్ సీహెచ్ పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తేవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపల్లి పైడిరాజు ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ సహాయ మేనేజర్ సీహెచ్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కాంప్లెక్స్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి అనేక సంవత్సరాలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని తెలిపారు. కాంప్లెక్స్ త్వరితగతిన పూర్తి చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. తగరపువలస ఊళ్లోకి గతంలో ఎక్స్‌ప్రెస్, పాసింజర్ బస్‌లు వచ్చేవని, అటు విజయనగరం వెళ్లాలన్నా, ఇటు విశాఖ వెళ్లాలన్నా ప్రజలకు సౌకర్యంగా ఉండేదని, ఇప్పుడు ఊళ్లోకి బస్‌ల రాకపోకలు లేకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కనీసం పాసింజర్ బస్ లైనా తగరపువలస ఊళ్లోకి వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, జిల్లా సమితి సభ్యులు మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పూర్ణిమ దాతృత్వం



బాధితునికి నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు శ్రీధర్

కంచరపాలెం: అనారోగ్యంతో మంచాన పడ్డ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి వైద్య సహాయం అందించి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దాతృత్వం చాటుకున్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి బాబుకాలనీలో నివాసం ఉంటున్న టెంక వెంకటరమణ గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ గురువారం బాధితుని వైద్య ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా పేదోడికి ఉచిత వైద్యం అందేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని పూర్తిగా విస్మరించడంతో పేదవాళ్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వార్డు బాధితులను గుర్తించి తమకు సమాచారం అందించడం అభినందనీయమన్నారు. బాధితులు నేరుగా తమను ఆశ్రయిస్తే ఆర్థికంగా ఆదుకునే విషయంలో ముందుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బొద్దనా లక్ష్మి, సరోజిని, అరసాడ లక్ష్మి, భారతి, వేశంగిణి రావు, కిషోర్, పరశురామ్, శ్రీను, రంజానమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురువులే సమాజ ప్రగతి నిర్దేశకులు



ఉపాధ్యాయులతో సీపీ డాక్టర్ శంకబ్రత బాగ్చీ తదితరులు

అల్లిపురం: సమాజ ప్రగతికి గురువులే మార్గ నిర్దేశకులని పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. గురువారం 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో 85 మంది ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గురు శిష్య సంప్రదాయం మానవజాతికి శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. తాను కూడా నాలుగేళ్లు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగానన్నారు. నేటికీ అది తనకు ఎంతో సంతృప్తి కలిగిస్తుందన్నారు. గురువులు పాఠాలతో పాటు వివిధ అంశాలపై విద్యార్థులకు విజ్ఞానం కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు. చాలా మంది ప్రమాదాలు జరిగినప్పుడు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఇప్పుడు పోలీసులు, కోర్టులంటూ ఇబ్బందులు ఏమీ ఉండవన్నారు. అలాగే విద్యార్థులు ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గురువులను ఎప్పుడూ పూజిస్తూనే ఉండాలని, తల్లిదండ్రుల తర్వాత స్థానం వారిదే అన్నారు. విద్యతోనే అపార ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ గురువుల వల్లే భారతదేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్లు కందుల బద్రీనాథ్, కేదార్నాథ్ శాలివాహన, విజయ్ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీకి నాగశిరోమణి పార్థివదేహం అప్పగింత



నాగ శిరోమణి పార్థివ దేహాన్ని ఏఎంసీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట: మురళీనగర్‌కు చెందిన వల్లభనేని నాగ శిరోమణి (76) గురువారం మృతి చెందారు. ఈమె భర్త వల్లభనేని వీర రాఘవయ్య (లేట్) కూడా శరీరదాతల సంఘంలో సభ్యులుగా ఉన్నారు. ఈ దంపతులు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గతంలోనే శరీరదాన పత్రాలు రాసి ఇచ్చారు. గురువారం నాలుగు గంటలకు విశాఖపట్నం జిల్లా శరీరదాతల సంఘం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు ఆధ్వర్యంలో నాగ శిరోమణి పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ డిపార్టుమెంట్‌కు అందజేశారు. శరీరదాత నాగ శిరోమణికి సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగ శిరోమణి కుమారుడు వెంకట రాజశేఖర్, కుమార్తె అనురాధ, బంధుమిత్రులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



మందిరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది భక్తులకు బీపీ, డయాబెటిక్ వంటి ఆరోగ్య పరీక్షలతో నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం తీసుకుంటున్న జంక్ ఫుడ్స్ వంటి ఆహార పదార్థాల వల్ల ఆరోగ్యాలు పాడవుతున్నాయని అవగాహన కల్పించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ మానస, సిబ్బంది అభిరామ్, ధ్యాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

తాటిచెట్లపాలెం: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా నిర్వహించే ఓటర్ల జాబితా సమీక్ష సమావేశం గురువారం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి ఆధ్వర్యంలో జరిగింది. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల మార్పులు చేయాల్సి ఉందని, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు.

అభివృద్ధికి మోకాలడ్డు

- సామాజిక భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న 36వ వార్డు కార్పొరేటర్
- రెల్లి కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు



నిర్మాణం ఆగిపోవడంతో వృథాగా పోతున్న కంకర (పిక్క)



నిర్మాణం ఆగిపోవడంతో వృథాగా పోతున్న ఇసుక



నిర్మాణ దశలో రెల్లి కుల సామాజిక భవనం

డాబాగార్డెన్స్: గత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్.. గత జీవీఎంసీ కమిషనర్ సృజన హయాంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. దానిలో భాగంగా జీవీఎంసీ 36, 37 వార్డులకు సంబంధించి బోర్డర్‌గా రెల్లికుల సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ ఉంది. గత ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ హయాంలో సంఘ కార్యాలయానికి సంబంధించి నిర్మాణం జరిపారు. అనంతరం 2021లో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సృజన, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ కృషి మేరకు కార్యాలయ రెండో అంతస్తులో సామాజిక భవనం ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ కృషితో ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. ఇసుక, కంకర, సిమెంట్, ఐరన్ వంటి సామగ్రి వచ్చింది. శ్లాబ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఎమ్మెల్యే అండదండలతో..

స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అండదండలతో 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ ఆ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని రెల్లికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సాక్షికి తెలిపారు. ప్రజా సంక్షేమం, వార్డు అభివృద్ధి కోసం నిర్మిస్తుంటే బోర్డర్ (36, 37 వార్డుకి సంబంధించి) పేరిట నిర్మాణం ఆపించడం తగదని చెప్పారు. సామాజిక భవనంపై కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్‌కు ఎందుకంత కక్ష అని, రెల్లిజాతిని విస్మరించడం తగదన్నారు. రెల్లి కులస్తులంటే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు, కార్పొరేటర్ మేరీజోన్స్‌కు ఇష్టం లేనట్టుందని అన్నారు. ఏ కార్యక్రమం నిర్వహించుకోవాలన్నా చాలీ చాలని స్థలాల కారణంగా రోడ్డు పైనే నిర్వహించుకోవల్సి వస్తుందని, తమకంటూ సామాజిక భవనం ఉంటే అక్కడే కార్యక్రమాలు నిర్వహించుకుంటామని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పందించి రెల్లి జాతి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ జానకీరామ్, రెల్లికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

కురసాల సత్యనారాయణకు ఘన నివాళి



కన్నబాబు తండ్రి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: మాజీమంత్రి కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. కాకినాడలోని వారి స్వగృహంలో గురువారం నిర్వహించిన దశ దిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని కన్నబాబును పరామర్శించారు. ముందుగా కన్నబాబు తండ్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వాసుపల్లితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు.

అజాత శత్రువు సురవరం



సుధాకరరెడ్డికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: సీపీఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అజాతశత్రువుగా, వివాద రహితుడుగా పేరుగాంచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆయన పార్టీ పట్ల అంకిత భావంతో పని చేసేవారన్నారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని సుధాకరరెడ్డికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి కర్నూలు నుండి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఢిల్లీ స్థాయికి ఎదిగారన్నారు. మావోయిస్టులను చంపేస్తామని హోం మంత్రి అమిత్ షా రంకెలు వేస్తున్నారని విమర్శించారు. ఈ విధంగా గతంలో ఏ హోం మంత్రి వ్యవహరించలేదని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మానవ ఆంజనేయులు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు సీహెచ్ రాఘవేంద్రరావు, జీవీఎంసీ సీపీఐ పక్ష నాయకుడు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, మహిళా చేతన నాయకురాలు కత్తి పద్మ, వామపక్ష పార్టీల నేతలు ఎస్. గోవిందరాజులు, గణేష్ పాండా, కె. దేవా, వై. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవ నిర్వాహకులకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం ఇగో బాయ్స్ కమిటీ సభ్యులకు రూ. 5 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్, స్టేట్ కల్చరల్ వింగ్ సెక్రటరీ కంటుముచ్చు సాగర్, 36వ వార్డు ప్రెసిడెంట్ మహ్మద్ షకీల్, జిల్లా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కిషోర్, జిల్లా ఎస్సీ సెల్ చెన్నా శ్రీధర్, జమీల్, సుబ్రహ్మణ్యం, జిల్లా ఆర్టీఐ సెక్రటరీ అరుగుల రాజు, బోడిపిల్లి శివ, కనక మహాలక్ష్మి, సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని యోగితకు బహుమతి అందజేస్తున్న ఎల్ఐసీ అధికారులు

డాబాగార్డెన్స్: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 69వ వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఆదిత్య బిజినెస్ స్కూల్ బీబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కె.యోగిత ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు జీవిత బీమా సంస్థ అధికారులు బహుమతి అందజేశారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడుతో పాటు డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర రీజినల్ మేనేజర్ పి.రామకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎంసీహెచ్ కిశోర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ రవితేజ, తెలుగు విభాగ అధ్యాపకుడు శర్మ విద్యార్థినిని అభినందించారు.